

# షర్మిల సమరయాత్ర



నేడు

పీసీసీ అధ్యక్షురాలి హోదాలో జగన్ పార్టీ ఓటమి కోసం జిల్లాలో సమరయాత్రకు వైఎస్ షర్మిల శ్రీకారం చుట్టారు. రాజన్న రాజ్యం తెస్తానని చెప్పిన జగనన్న.. రాక్షసరాజ్యం తెచ్చారంటూ ఇప్పటికే అన్నపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం అయిన తరువాత మారిపోయాడు. అసలు ఈయన ఎవరో నాకు తెలియదు. నా అనుకున్న వారిని నాశనం చేశాడంటూ జగన్‌పై షర్మిల తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. సొంత చిన్నాన్న వివేకానందరెడ్డిని చంపిన హత్యకేసులో నిందితుడిగా ఉన్న అవినాశ్‌రెడ్డికి టికెట్ ఇచ్చాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు అన్న పార్టీ గెలుపు కోసం 'జగనన్న వదిలిన బాణం' అంటూ సుదీర్ఘ పాదయాత్ర చేస్తే.. నేడు అన్న పార్టీని ఓడించేందుకు సొంత గడ్డలో బస్సుయాత్ర మొదలుపెడుతున్నారు. నాడు.. నేడు తొలి అడుగులు సొంతగడ్డ నుంచే పడడం గమనార్హం. జగన్ పార్టీని ఓడించేందుకు శుక్రవారం నుంచి షర్మిల బస్సు యాత్ర బద్వేలు నియోజకవర్గం ఇటుకలపాడులోని అమగంపల్లె నుంచి ప్రారంభించనున్నారు.

- జగనన్న వదిలిన బాణం.. నాడు అన్నకోసం పాదయాత్ర
- వైసీపీ ఓటమి కోసం.. నేడు బస్సుయాత్ర
- తొలి రెండడుగులు సొంత గడ్డ నుంచే
- నేటి నుంచి జిల్లాలో షర్మిల బస్సుయాత్ర
- హాజరు కానున్న వివేకా కుమార్తె సునీత

(కడప-ఆంధ్రజ్యోతి): అది 2012 అక్టోబరు. అప్పటికే జగన్ సొంత పార్టీ పెట్టుకున్నారు. అక్రమాస్తుల కేసులో చంచల్‌గూడ జైలులో ఉన్నారు. జగన్ అరెస్టుతో అప్పట్లో వైసీపీ మనుగడ ఉండదేమోనన్న భయం ఆ పార్టీ శ్రేణుల్లో ఉండేది. పార్టీని బతికి బట్ట కట్టించుకోవాలంటే షర్మిలాతో పాదయాత్ర చేయించాలని జగన్‌తో సహా కుటుంబ సభ్యులు, పార్టీ ముఖ్యనేతలు నిర్ణయించారు. అన్న చెప్పినట్లుగానే చెల్లి షర్మిల పాదయాత్రకు సిద్ధమయ్యారు. 2012 అక్టోబరు 18న ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు మరో ప్రజాప్రస్థానం పేరిట పాదయాత్ర మొదలుపెట్టారు. తాను జగనన్న వదిలిన బాణం అంటూ పాదయాత్ర పొడవునా సభల్లో చెప్పారు. ఒక రోజు రెండు రోజులు కాదు... 230 రోజుల పాటు 14 జిల్లాలు, 116 నియోజకవర్గాల్లో 3,112 కి.మీ పాదయాత్ర చేసి కడపబిడ్డ అనిపించుకున్నారు. అన్న కోసం పాదయాత్రలో ఎన్నోకష్టాలు ఓర్చుకున్నారు... సీన్ కట్ చేస్తే.. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఏం జరిగిందో అందరికీ తెలుసు.. సోదరి షర్మిలకు ఎంత ప్రాధాన్యం ఇచ్చారో, వివేకా హత్య కేసులో ఆయన ఎవరివైపు నిలబడ్డారో షర్మిలానే కాదు.. జనమూ గ్రహించారు.

### కడప ఎంపీగా అందుకే పోటీ..

జగన్ సీఎం అయిన తరువాత వైఎస్ కుటుంబంలో విభేదాలు బయటికి వచ్చాయి. వివేకా హత్య తరువాత చోటుచేసుకున్న పరిణామాలతో దివంగత వైఎస్ వివేకానందరెడ్డి, షర్మిల ఒక వైపు ఉండగా.. జగన్ ఆయన సతీమణి భారతి, అవినాష్‌రెడ్డి మరో వైపు ఉన్నారు. ఇక వివేకా హత్యలో సీబీఐ విచారణ తరువాత ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిపై చార్జిషీట్లు దాఖలు చేయడంతో సంచలనం రేకెత్తుతూ వచ్చింది. ఎంపీ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలపై షర్మిల, వివేకా కూతురు సునీత నేరుగా ఆరోపణలు చేస్తూ వచ్చారు. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు చేపట్టిన తరువా త.. వివేకా హత్యతో పాటు వైసీపీ ప్రభుత్వ వైఫల్యా లపై ఆమె విరుచుకు పడుతున్నారు. వైసీపీ పునాదులు వివేకా రక్తంతో తడిచి ఉన్నాయంటూ సునీతతో పాటు షర్మిల పదేపదే చెబుతూ వస్తున్నారు. "చిన్నాన్న చివరి కోరిక నేను ఎంపీగా నిలవాలన్నదే. నా వద్దకు వచ్చి దాదాపు రెండుగంటల పాటు నీవు ఎంపీగా నిలబడాలమ్మా అని ప్రాధేయపడ్డాడు. ఎందుకు అంతగా అడుగుతున్నాడో ఆ రోజు అర్థం కాలేదు. కానీ ఈ రోజు అర్థమవుతోంది. వివేకాను హత్య చేసిన వారికి ఈ రోజు వరకు శిక్ష లేదు. హత్య చేసిన వారు చేయించిన వారు తప్పించుకునే తిరుగుతున్నారు. అవినాశ్‌కు టికెట్ ఇవ్వడాన్ని తట్టుకోలేకపోయా. అందుకే కాంగ్రెస్ నుంచి కడప ఎంపీగా పోటీ చేస్తున్నా" అంటూ షర్మిల ఈ నెల 2న ఇడుపులపాయలోని వైఎస్ ఘాట్ వద్ద వెల్లడించారు.

### వైసీపీలో కలవరం

కడప పార్లమెంటు స్థానంలో వరుసగా వైఎస్ కుటుంబీకులే గెలుస్తున్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వివేకానందరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి గెలుస్తూ వచ్చారు. అయితే ఈసారి అదే వైఎస్ కుటుంబం నుంచి దివంగత రాజశేఖర్‌రెడ్డి బిడ్డ జగన్ చెల్లి షర్మిల కాంగ్రెస్ నుంచి నిలబడుతుండగా.. వైసీపీ నుంచి ఎంపీ అవినాశ్‌రెడ్డి బరిలో ఉన్నారు. 2011 వరకు కడప జిల్లాలో కాంగ్రెస్‌కు పట్టు ఉండేది. జగన్ సొంత పార్టీ, రాష్ట్రవిభజనతో కాంగ్రెస్ పార్టీలోని వారంతా వైసీపీ, టీడీపీలోకి జంప్ అయ్యారు. దీంతో కాంగ్రెస్ దాదాపు ఉనికి కోల్పోయింది. అయితే షర్మిల బాధ్యతలు చేపట్టిన తరువాత కాంగ్రెస్‌లో కదలిక వచ్చింది. దీనికి తోడు కడప నుంచి ఎంపీగా పోటీ చేస్తున్నట్టు ప్రకటించారు. ఇక కాంగ్రెస్ కేడరులో ఊపు ఉత్సాహం తీసుకు వచ్చేందుకు షర్మిల బస్సుయాత్ర చేపడుతున్నారు. జనం కూడా చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వైఎస్సార్ బిడ్డగా షర్మిలకు జగన్‌తో సమానంగా జిల్లావాసుల్లో ఇమేజ్ ఉంది. రాజశేఖర్‌రెడ్డి కూతురుగా వైసీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు పాదయాత్ర చేసిన సానుభూతి ఆమెపై ఉంది. ఈ నేపథ్యంలో ఆమె బస్సుయాత్ర వైసీపీలో కలవరం కలిగిస్తోంది.

### వివేకా హత్య ప్రధానాస్త్రం?

ఈ ఎన్నికల్లో మాజీమంత్రి దివంగత వైఎస్ వివేకా హత్య ప్రధానాస్త్రంగా మారనుంది. వివేకా సౌమ్యుడు. పార్టీలకతీతంగా ఆయనను అందరూ ఆదరించేవారు. కడప పార్లమెంటు పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో ఆయనకు అభిమానులు ఉన్నారు. అయితే కొన్ని పరిస్థితుల దృష్ట్యా ఇప్పటి దాకా బయట పడలేదు. ఇప్పుడు షర్మిల కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తుండడంతో వైసీపీలో ఉన్న వివేకా అభిమానులంతా ఆమె వెంట నడిచే అవకాశం ఉంది. ఎలాగైనాసరే సొంత గడ్డలో గెలవాలన్న లక్ష్యంతో.. సొంత గడ్డలో పట్టు కోసం వ్యూహాత్మకంగా షర్మిల అడుగులు వేస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల బరిలో నిలిపేందుకు బలమైన అభ్యర్థుల కోసం ఆరా తీస్తున్నారు. ఇక బస్సుయాత్రలో జగన్‌పై షర్మిల ఎలా విరుచుకుపడతారో అన్న ఆందోళన వైసీపీ శిబిరాన్ని కుదిపేస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పుడు సొంత చెల్లి షర్మిల రంగంలో దిగడంతో వివేకా హత్యకు సంబంధించి మరిన్ని సంచలనాలు బయటకి వస్తాయేమోనన్న ఆందోళన వారిలో ఉంది.

### నేటి నుంచి ప్రారంభం

శుక్రవారం బద్వేలు నియోజకవర్గంలోని కాశినాయన మండలం అమగంపల్లె నుంచి 9.45గంటలకు షర్మిల బస్సుయాత్ర మొదలుపెడతారు. ఈ మేరకు కాంగ్రెస్ శ్రేణులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో బద్వేలు అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయజ్యోతి పోటీ చేయనున్నారు. తొలిరోజు బస్సుయాత్ర మొదలై అమగంపల్లె, ఇటుకలపాడు, సావిశెట్టిపల్లె, ఆకులనారాయణపల్లె, వరికుంట్ల, బాలాయపల్లె, నరసాపురం, గొంటుగారిపల్లె, జంగనపల్లె నుంచి మధ్యాహ్నం 1.20కి కలసపాడు చేరుకుంటుంది. 4గంటలకు మొదలై మహానందిల్లె, మామిళ్లపల్లె, లింగారెడ్డిపల్లె, శంకవరం, మార్క్యాపురం మీదుగా సాయంత్రం 5.20కి పోరుమామిళ్ల గాంధిబొమ్మ చేరుకుంటుంది. అంబేడ్కర్ సర్కిల్ మీదుగా బి.కోడూరు, బద్వేలు, గోపవరం మండలాల నుంచి 9గంటలకు అట్లూరుకు చేరుకుంటుంది. బస్సు యాత్ర 12వ తేదీ వరకు కొనసాగనుంది.

### సునీత హాజరు

వివేకా కేసులో నిందితుడి ఓడించేందుకు ఎంపీ అభ్యర్థిగా షర్మిలా బరిలోకి దిగుతున్నారు. గెలుపే లక్ష్యంగా నేటి నుంచి జిల్లాలో బస్సుయాత్ర చేపట్టారు. ఈమెకు మద్దతుగా వైఎస్ వివేకా కుమార్తె సునీత కూడా బస్సు యాత్రలో పాల్గొననున్నారు. సొంత అన్న జగన్ తమకు చేసిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటనున్నారు. వివేకా హత్య నిందితులకు ఇంకాశిక్ష పడకపోవడంతో ప్రజాక్షేత్రంలో తమ వాణి వివనిపించి న్యాయం కోరనున్నారు.



### దేవుడి దీవెనలతో..

దేవుడి దీవెనలతో నాన్న ఆశీర్వాదంతో, అమ్మప్రేమతో చిన్నాన్న చివరి కోరిక ప్రకారం ఎన్నికల ప్రచారానికి బయళ్దేరుతున్నాను. మీ రాజన్న బిడ్డను దీవించాలని ఆంధ్రరాష్ట్ర ప్రజలను కోరుకుంటూ ఎన్నికల శంఖారావం పూరించనున్నాను. న్యాయం కోసం పోరాడుతున్న ఈ యుద్ధంలో మీ ఆశీస్సులు నాపై ఉంటాయని ఆశిస్తున్నాను.

- ఇట్లు మీ వైఎస్ షర్మిలా రెడ్డి అంటూ షర్మిల గురువారం సాయంత్రం ట్విట్టర్(ఎక్స్)లో పోస్టు చేశారు.

కడపలో చెంద్రాయుడు కుటుంబానికి భరోసా కల్పిస్తున్న నారా భువనేశ్వరి



## వైసీపీ రాక్షస పాలనలో
# టీడీపీ కార్యకర్తలు బలి

- ప్రభుత్వ తప్పిదాలు చంద్రబాబుపై వేసే ప్రయత్నం
- పెన్షన్ల విషయంలోనూ వైసీపీ కుట్ర
- 'నిజం గెలవాలి'లో నారా భువనేశ్వరి
- కడప, ప్రొద్దుటూరులో బాధితులకు పరామర్శ

కడప (ఎర్రముక్కపల్లె)/ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 4: వైసీపీ రాక్షసపాలనలో టీడీపీ కార్యకర్తలను చంపడం, హింసించడం, ఇబ్బందులు పెట్టడం అలవాటుగా మారిందని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. గత ఏడాది చంద్రబా బు అక్రమ అరెస్టుతో పలువురు టీడీపీ కార్యకర్తలు గుండెపోటుతో మృతిచెందారు. వీరి కుటుంబాలను 'నిజం గెలవాలి' పేరిట నారా భువనేశ్వరి పరామర్శిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం జిల్లాకు వచ్చారు. కడప నగరంలోని చెమ్మామియాపేటలో గుండెపోటుతో మృతిచెందిన టీడీపీ కార్యకర్త చెంద్రాయుడు కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. చెంద్రాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మండుటెండను సైతం లెక్క చేయని అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం కోసం చంద్రబాబు రాత్రింబవళ్లు ఎలా కష్టపడ్డారో ప్రజలందరికీ తెలుసునన్నారు. మరోఐదేళ్లు చంద్రబాబు సీఎంగా ఉంటే రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందేదో అందరికీ ఇప్పటికే అర్థమై ఉంటుం దన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీకి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, పైగా రాష్ట్రంలోని పరిశ్రమలు పక్కరాష్ట్రాలకు పోయాయన్నారు. వైసీపీ రాక్షస పాలనలో టీడీపీ కార్యకర్తలను బలిచేయడమే అలవాటుగా పెట్టుకుందన్నారు. గంజాయి, ఇసుక మాఫియా, భూకబ్జాలు, కల్తీ మద్యంలో వైసీపీ ప్రభుత్వం ఏపీని దేశంలో ముందు వరుసలో నిలబెట్టిందన్నారు. వైసీపీ చేసే ప్రతి తప్పును చంద్రబాబుపై నెట్టేసి చేతులు దులుసుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. నేడు కొత్తగా పెన్షన్ల విషయాన్ని కుట్రపూరితంగా చంద్రబాబుకు ఆపాదిస్తున్నారన్నారు. వృద్ధులను మంచాలపై ఎండలో తీసికెళ్లి వారి ప్రాణాలను వైసీపీ నాయకులు, కార్యకర్తలు నిన్న బలి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం తపించిన చంద్రబాబు పేదవారికి పెన్షన్లను అడ్డుకోరనే విషయం రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, మీడియా సెల్ జిల్లా కోఆర్డినేటరు జనార్ధన్, మాజీ జీపీ గురప్ప, సునీత, 45వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ప్రొద్దుటూరులో..

చంద్రబాబు అక్రమ అరెస్టుతో ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లెలో 1వ వార్డు సభ్యురాలు కూరపాటి రాధ మనోవేదనకు గురై గుండెపోటుతో మృతిచెందారు. ఆమె కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైసీపీ అరాచకానికి రాష్ట్ర వ్యాప్తంగా 256 మంది టీడీపీ కార్యకర్తలు హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరులో నందం సుబ్బయ్య హత్య కలచి వేసిందన్నారు. నందం సుబ్బయ్య తల్లి లక్ష్మీదేవి మాట్లాడుతూ తన కొడుకును ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, బంగారు రెడ్డిలే హత్య చేయించారన్నారు. నందం సుబ్బయ్య సతీమణి అపరాజిత మాట్లాడుతూ వారి అరాచకాలను తన భర్త ప్రశ్నించడంతో తట్టుకోలేక హత్య చేశారన్నారు. వైసీపీ అరాచకాలను అడ్డుకోవాలంటే వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలన్నారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి దేవగుడి భూపేశ్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జబివుల్లా, బండి విజయభాస్కర్‌రెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి, బోడెల బాబుల్‌రెడ్డి, సర్పంచ్ మధుసూదన్, పాణ్యం సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో కూరపాటి రాధ కుటుంబ సభ్యులతో నారా భువనేశ్వరి

## పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

- 13, 14న పీవో, ఏపీవోలకు శిక్షణ
- శిక్షణకు గైర్హాజరు అయితే చర్యలు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 4: సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది నియమకం కోసం మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయిందని, నియమితులైన సిబ్బంది శిక్షణకు హాజరు కాకపోతే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 35 మండలాల పరిధిలో 2,035 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కడప పార్లమెంట్ పరిధిలోని 1,963 కేంద్రాలతో పాటు సిద్దవటం, ఇంటిమిట్ట మండలాలకు సంబంధించి మరో 72 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. వచ్చే నెల 13వ తేదీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బందిని నియమించామన్నారు. వారిలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఈనెల 13, 14 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో మొదటి శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఆరుగురు సిబ్బంది చొప్పున 20 శాతం రిజర్వుతో సిబ్బందిని నియమించామన్నారు. సిబ్బంది శిక్షణ తరగతులకు గైర్హాజరు అయితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్ గౌడ్, సీపీవో వెంకటరావు, డీఐఓ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మేము పాలకులం కాదు.. సేవకులం

- రాజంపేట సర్వతోముఖాభివృద్ధికి పాటుపడతా
- అన్నమయ్య ప్రాజెక్టును నిర్మిస్తా
- మెడికల్ కళాశాలను తెప్పిస్తా
- రాజంపేటకు రింగ్‌రోడ్డు వేయిస్తా
- జిల్లా కేంద్రంకోసం పాటుపడతా
- పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తా
- రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం





టీడీపీ కార్యాలయ ప్రారంభోత్సవ సమావేశానికి హాజరైన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట, ఏప్రిల్ 4: తాము పాలకులం కాదు సేవకులమని.. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాజంపేట సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. రాజంపేటలోని ఎల్‌ఐసీ ఆఫీసు పక్కన ఉన్న ఏబీ చంద్రారెడ్డి కల్యాణమండపంలో టీడీపీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ... తమ తండ్రి సుగవాసి పాలకొండ్రాయుడు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే ఉంటూ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచారన్నారు. తాను రైల్వేకోడూరులో పుట్టానని, రాజంపేటలో పెరిగానని, రాయచోటిలో ఉంటున్నానన్నారు. రాజంపేటలోని సుండుపల్లి, వీరబల్లి మండలాల ప్రజలకు తమ కుటుంబం ఎంతో సేవ చేసిందన్నారు. రాజంపేట, నందలూరు, సుండుపల్లి, వీరబల్లి, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. తాము పాలకులము కాదని, సేవకులమని అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవడమే మనందరి ధ్యేయమన్నారు. పార్టీ గెలుపుకోసం కృషి చేసే కార్యకర్తలకు, నాయకులకు సముచిత స్థానం రావడానికి అన్ని విధాలా పాటుపడతామన్నారు. తాను రాజంపేటలోనే ఉంటానని, ఇక్కడ నిజాయితీ కలిగిన టీడీపీ కార్యకర్తలు ఉండటం తన అదృష్టమన్నారు. తాము రాజంపేట ఎమ్మెల్యే టికెట్టు ఆశించలేదని, పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఇక్కడ పోటీ చేస్తున్నాను తప్ప ఎవ్వరినీ ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశ్యం లేదన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. అన్నమయ్య డ్యాంను నిర్మిస్తామని, మెడికల్ కళాశాలను తెప్పిస్తానని, రాజంపేట అభివృద్ధితో పాటు రింగ్‌రోడ్డును వేయిస్తానని అన్నారు. మీ అందరి ఆకాంక్ష మేరకు రాజంపేటను జిల్లా కేంద్రం చేసేందుకు పాటుపడతానన్నారు.

### మాది మాటతప్పని మడమ తిప్పని కుటుంబం

- ప్రసాద్‌బాబు

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ తమ తండ్రి పాలకొండ్రాయుడు అడుగు జాడల్లో తన సోదరుడు, ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ఎంతో నిజాయితీ పరుడని, సేవాతత్పరుడని అన్నారు. ఆయనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాజంపేట నియోజకవర్గ అభివృద్ధికి, కార్యకర్తల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడతామన్నారు. తమది మాటతప్పని మడమ తిప్పని కుటుంబమన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బాలిశెట్టి హరిప్రసాద్, చెన్నూరు సుధాకర్, జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, జిల్లా కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు శివన్నారాయణ చౌదరి, జనసేన పార్టీ రాష్ట్ర మహిళా నేత రెడ్డిరాణి, మాజీ మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ ఎద్దల విజయసాగర్, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సంజీవరావు, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, ఒంటిమిట్ట మండల పార్టీ ప్రధానకార్యదర్శి బొబ్బిలి రాయుడు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, రాజంపేట అసెంబ్లీ టీడీపీ ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, బీసీ నాయకులు రాము యాదవ్, దొంతం శివ, మహిళానేత సుజాత, జిల్లా టీడీపీ కార్యదర్శి నాగమునిరెడ్డి, రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షురాలు వాణి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేకోడూరు జనసేన
# అభ్యర్థిగా అరవ శ్రీధర్



రైల్వేకోడూరు, ఏప్రిల్ 4: రైల్వేకోడూరు జనసేన పార్టీ టిక్కెట్టును ఓబులవారిపల్లె మండలంలోని ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్‌కు కేటాయిస్తూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ గురువారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల పెనగలూరు మండలంలోని నరసింగరాజపురానికి చెందిన యనమల భాస్కర్‌రావుకు టిక్కెట్టు కేటాయించిన విషయం తెలిసిందే. కొన్ని కారణాలతో టిక్కెట్టు మార్చి అరవ శ్రీధర్‌కు కేటాయించారు. అరవ శ్రీధర్ ముక్కావారిపల్లెకు సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. ఆయన బీటెక్ చదువుకున్నారు. ఎస్సీ మాల సామాజికవర్గానికి చెందిన ఆయన స్వగ్రామం ముక్కావారిపల్లె దళితవాడ. తల్లి ప్రమీల, తండ్రి వెంకటయ్య చియ్యవరం వీఆర్వోగా పనిచేస్తున్నారు.

## రైలును ఢీకొని యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన రాజేశ్

జమ్మలమడుగు, ఏప్రిల్ 4: డెమో రైలును ఢీకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు జమ్మలమడుగు మండలం కొత్త గుంటపల్లికి చెందిన బత్తల రాజేశ్ (30) గురువారం ఉదయం మోపెడ్‌లో జమ్మలమడుగు రైల్వేస్టేషన్ వద్దకు వచ్చి వాహనాన్ని పార్కింగ్ చేసి స్టేషన్‌లోకి వెళ్లాడు. నంద్యాల-కడప డెమో రైలు రాగానే ఎదురుగా వెళ్లి రైలును ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి వివాహం కాలేదు.

## కుటుంబ కలహాలతో వివాహిత బలవన్మరణం



సునీత మృతదేహం

కాశినాయన ఏప్రిల్ 4: మండలంలోని కొండ్రాజుపల్లెలో జాజం సునీత (25) అనే వివాహిత గురువారం ఉరి వేసుకొని చనిపోయినట్లు నర్సాపురం ఏఎస్ఐ కాశయ్య తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. రెండేళ్ల క్రితం కుమారి చిన్నసిద్ధయ్య రెండవ కూతురు సునీతను హైదరాబాద్‌లో పోలీస్ ఉద్యోగం చేస్తున్న జాజం సిద్దులుకు ఇచ్చి వివాహం చేశారు. పెండ్లి అయిన ఏడాదిలోపే భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. పలుమార్లు పెద్దమనుషులు పంచాయతీలు చేశారు. విష యం కోర్టు వరకు వెళ్లింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో అక్క వద్ద ఉంటున్న సునీత గురువారం ఉదయం కొండ్రాజుపల్లెలోని పుట్టింటికి వచ్చింది. ఒకవైపు భర్త వేధింపులు మరోవైపు ఒంటరితనం భరించలేక ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరి వేసుకుంది. మృతురాలి భర్త ప్రస్తుతం హైదరాబాద్‌లోని నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోరుమామిళ్లకు తరలించారు.

## బంగారు ఆభరణాలు సీజ్

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 4 : తమ పరిధిలో సుమారు 830 గ్రాముల బంగారు ఆభరణాలు సీజ్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. గురువారం వాహనాల తనిఖీ చేస్తుండగా, నెలటూరు ఉబేదుల్లా అనే వ్యక్తి వద్ద 830 గ్రాముల బంగారు ఆభరణాలు (రూ.54లక్షలు) పట్టుబడ్డాయన్నారు. సమావేశంలో ఎస్ఐ మంజునాథ్, సిబ్బంది ఉన్నారు.

## రూ.10 లక్షల నగదు పట్టివేత

రాయచోటిటౌన్, ఏప్రిల్ 4: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ లోకేశ్‌ల ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని సుండుపల్లె రోడ్డులోని షిఫా హాస్పిటల్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.10 లక్షల నగదు పట్టుబడింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... పట్టణంలోని సుండుపల్లె రోడ్డులో గల షిఫా హాస్పిటల్ సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎస్ఐ ఎం.లోకేశ్ రాయచోటి పట్టణంలోని షిఫా హాస్పిటల్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సిద్దయ్య అను వ్యక్తి వద్ద నుంచి ఎలాంటి ఆధారాలు లేని రూ.10 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదు సీజ్ చేసి ట్రెజరీలో జమచేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది రామచంద్ర, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేటలో రూ.70 వేలు...

రాజంపేటటౌన్, ఏప్రిల్ 4: రాజంపేట పట్టణంలోని ఈడిగపాలెం బైపాసు ప్రాంతంలో రాజంపేట పట్టణ సీఐ మద్దయ్య ఆచారి ఆధ్వర్యంలో నాకాబందీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున నూతన వ్యక్తులు సంచారం, అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈడిగపాలెంలో పలు అనుమానిత వాహనాలను, ఇళ్లను తనిఖీ చేశామని, అందులో సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బైపాసు ప్రాంతంలో వాహనాల తనిఖీ చేస్తుండగా రాజంపేట డీబీఎస్‌పల్లెకు చెందిన దివాకర్‌నాయుడు రూ.70 వేల నగదుతో వెళుతుండగా విచారించామని, నగదుకు సంబంధించిన సరైన రికార్డులు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేల నగదు పైబడి ఎవరైనా తీసుకెళ్లడం నేరమని, నగదుకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేనిపక్షంలో ఆ నగదును స్వాధీనం చేసుకుంటామని సీఐ తెలిపారు.

## మోటారు బైకు అదుపు తప్పి ఒకరి మృతి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 4 : మోటరు బైకు అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కవలకుంట్ల హరిజనవాడకు చెందిన వీరపోగు వెంకటయ్య (38) గురువారం పోరుమామిళ్ల నుంచి ముసల్‌రెడ్డిపల్లె మీదుగా కవలకుంట్లకు వెళుతుండగా చెరువు కట్ట మలుపులో బైకు అదుపు తప్పడంతో, తలకు బల మైన గాయం తగిలడంతో పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంటు సలహాదారుడు నాగార్జునరెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు సంతానమని తెలిసింది.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కడప (క్రైం), ఏప్రిల్ 4 : కడప నగరం వడ్డెరకాలనీకి చెందిన ఓ వ్యక్తి బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు... పొన్నరెడ్డి ప్రసాద్ (37) కడప వడ్డెరకాలనీలో నివాసం ఉంటున్నాడు. మూడునెలల క్రితం భార్య సుప్రజ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లింది. రెండు సంవత్సరాల పాపను ఆమె పుట్టింట్లో వదిలేసి వెళ్లింది. ఒంటరిగా ఉంటున్న రెడ్డిప్రసాద్ కూడా కువైట్‌కు వెళ్లానుకుంటున్నట్లు తెలిపారు. భార్య దూరం కావడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తల్లి బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## లోఓల్టేజీని అరికడదాం : ట్రాన్స్‌కో ఎస్ఈ

సంబేపల్లె, ఏప్రిల్ 4: విద్యుత్ సరఫరాలో లోఓల్టేజీ సమస్యపై అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేద్దామని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ తెలిపారు. గురువారం మండలంలోని సంబేపల్లె, యర్రగుంట్ల, దేవపట్ల ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. సంబేపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చిన్నమండెం, సంబేపల్లె మండలాల క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని, లోఓల్టేజీ సమస్య అధిగమించేందుకు అవసరమైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. నీటి పథకాల కొత్త పనుల మరమ్మతులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలన్నారు. ఇందులో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను, తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి సెట్ చేయాలన్నారు. నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయని, పనులు చేసేటప్పుడు సిబ్బంది భద్రత నియమాలు తప్పక పాటించాలన్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌లు మార్చడం, ఫీజులు వేయడం వంటి పనులపై వెంటనే స్పందించాలన్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, నివాసం ఉండని ఉద్యోగులకు ఇంటి అద్దె ఆపివేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, సంబేపల్లె అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేశ్, జేఈలు సిబ్బంది పాల్గొన్నారు.

## నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రతిభ




నవోదయ ప్రవేశాలు సాధించిన విశ్వం విద్యార్థులు

తిరుపతి (విద్య), ఏప్రిల్ 4: నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో తిరుపతి విశ్వం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి తెలిపారు. 39 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి నవోదయ పాఠశాలల్లో ప్రవేశాలు సాధించారని వెల్లడించారు. లక్ష్మీశ్రీ, జ్యోత్స్న, ఉదయశ్రీ, లాస్య, గౌతంకుమార్, కేతన్ భాస్కర్, లిఖిత, గంగజయదీప్‌రెడ్డి తదితరులు ప్రవేశాలు పొందిన వారిలో ఉన్నారని చెప్పారు. అకడమిక డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాల వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థ అత్యుత్తమమైందిగా పేరుగాంచిందని చెప్పారు.

# డ్వాక్రా మహిళలకు గాలం



- యానిమేటర్లను రంగంలోకి దింపిన వైసీపీ
- ఎస్ఎల్ఎఫ్ రుణాలను ఇంతవరకు ఇవ్వని వైనం
- ఎన్నికల తర్వాత ఎస్ఎల్ఎఫ్ రుణాలు ఇస్తాం అంటూ
- డ్వాక్రా మహిళల ఓట్ల కోసం కొత్తమార్గం

పులివెందుల రూరల్, ఏప్రిల్ 4: ఏ ఒక్క ఓటును పక్కకు వెళ్లనివ్వకుండా రోజుకొక కొత్తదారిని వెతు క్కుంటున్న వైసీపీ.. ఇప్పుడు మరో మార్గం వేసింది. కొందరికే పరిమితమైన 'రుణాలు అందరికీ చేరువ చేస్తాం మా వెంట నడవండి' అని కొత్త ప్రచారానికి తెరలేపారు. అయితే ఈ మార్గం కేవలం డ్వాక్రా మహిళలకు మాత్రమే అంటూ గాలం వేస్తున్నారు. ఈ అస్త్రాన్ని ప్రయోగిం చేందుకు యానిమేటర్లను రంగంలోకి దింపుతు న్నారు. వివరాల్లోకి వెళితే..

పులివెందుల మెప్మా కింద ఎస్‌హెచ్‌జీ (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్) సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తారనేది అందరికీ తెలిసిన విషయమే. ఆ రుణాన్ని వడ్డీతో సహా కంతుల వారీగా చెల్లిస్తుంటారు. ఈ చెల్లింపుతో పాటు సాధారణ పొదుపు చెల్లిస్తుంటారు. ఆయా గ్రూపుల ఆర్థిక స్థోమతను బట్టి రూ.100 నుంచి చెల్లిస్తుంటారు. ఈ సాధారణ పొదుపు చెల్లిస్తే గ్రూపులోని సభ్యులకు అత్యవసర పరిస్థితుల్లో ఇందులో నుంచి ఇది వరకు చెల్లించిన దానికంటే ఐదారురెట్ల రుణం ఇస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ పొదుపు నుంచి రుణం పొంది తమ అవసరాలను తీర్చుకుంటుంటారు. ఈ సాధారణ పొదుపు సభ్యులందరికీ తెలిసేలా ఉంటుంది. సాధారణ పొదుపుతో పాటు మరో పొదుపు కూడా చెల్లిస్తుంటారు. అదే ఎస్ఎల్ఎఫ్ (స్లమ్ లెవెల్ ఫెడరేషన్) పొదుపు. ఈ పొదుపు కింద దాదాపు 25 గ్రూపులు ఉంటాయి. ఇందులో ప్రతినెల ఒక్కో సభ్యురాలు రూ.100 చెల్లించాల్సిందే. ఈ పొదుపు నకు సంబంధించి రసీదులు గాని, ఇంతవరకు ఖాతాలో ఎంత నిల్వ ఉన్నది సభ్యులకు తెలియదు. ఇదంతా ఆర్పీల చేతుల్లో ఉంటుంది. ఈ డబ్బు బ్యాంకు అకౌంట్‌లో ఎవరి పేరుమీద ఉంటుందనే విషయం కూడా సభ్యులకు పూర్తిగా బహిరంగ పర్చరు. గతంలో గ్రూప్ సభ్యుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని కొందరు ఆర్పీలు ఎస్ఎల్ ఎఫ్‌లో పొదుపు నగదును డ్రా చేసి వారికే తిరిగి వడ్డీలకు ఇవ్వడం చేసేవారు. సంఘాలలో డబుల్ ఎంట్రీలు, అవసరం లేకున్నా సభ్యులను చేర్చి ఇష్టానుసారంగా ఆర్పీలు రుణాలు వాడుకునే వారనే ఆరోపణలు ఉన్నాయి. ఇది బహిరంగ రహస్యం.

### ఆర్పీలను రంగంలోకి దింపిన వైసీపీ

ఎన్నికలలో ఈసారి వైసీపీ ఆర్పీలను రంగంలోకి దింపినట్లు సమాచారం. వీరి ద్వారా ఎస్ఎల్ఎఫ్ రుణాల పేరిట ఆశ చూపుతున్నట్లు తెలిసింది. ఎన్నికలు అయిపోయిన తర్వాత ఎస్ఎల్ఎఫ్ రుణాలు ఇప్పించి మరింత సహకారం అందిస్తా మని మహిళలను మభ్యపెడుతున్నట్లు తెలిసింది. అయితే డ్వాక్రా సంఘంలోని పది మందిలో ఒకరికే రుణం పొందే అవకాశం ఉంటుంది. గత రెండు మూడేళ్లుగా ఎస్ఎల్ఎఫ్ రుణాలు ఇవ్వకపోవ డంతో నిల్వలు భారీగా ఉన్నట్లు తెలిసింది. ఆ నగదును ఎన్నికల అనంతరం అందరికీ సమానంగా పంచేం దుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. డ్వాక్రా మహిళల ఓట్ల కోసం సరికొత్త మార్గాన్ని కనిపెట్టిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

### పులివెందుల మెప్మాలో..

పులివెందుల పట్టణ పరిధిలో 1330 ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఉండగా వీటికి 44 మంది ఆర్పీలు ఉన్నారు. ఈ గ్రూపులకు సంబంధించిన సమా చారం, విధివిధానాలు అన్నీ ఆర్పీల చేతుల్లోనే ఉంటాయి. ఈ 44 మంది ఆర్పీల పరిధిలో దాదాపు 13,300 మంది సభ్యులు ఉన్నారు. ఈ సభ్యులంతా వారు పొందిన రుణ కంతులు, సాధారణ పొదుపు రూ.100 చెల్లిస్తుంటారు. అయితే ఈ చెల్లింపుతో పాటు ఎస్ఎల్ఎఫ్ పొదుపు నెలనెలా రూ.100 చెల్లిస్తుంటారు. ఎస్ఎల్ఎఫ్ ఖాతాకు సంబంధించి అంతా ఆర్పీనే రాజు, మంత్రిగా వ్యవహరిస్తుంటారు. సభ్యులు చెల్లించిన ఎస్ఎల్ఎఫ్ పొదుపు నుంచి టీఎల్ఎఫ్ (టౌన్ లెవెల్ ఫెడరేషన్)కు ప్రతినెల ఆర్పీలు రూ.1,000 చెల్లిస్తుంటారని చెబుతున్నారు. టీఎల్ఎఫ్ విషయాన్ని పక్కనపెడితే ఎస్ఎల్ఎఫ్ పొదుపులో ఆర్పీలు తమ మాయ జాలాన్ని ప్రదర్శిస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి.

### పూర్తి వివరాలు తెలియదు

ఎస్ఎల్ఎఫ్ పొదుపు ఖాతా గురించి తమకు పూర్తిగా తెలియదని పలు సంఘాల సభ్యులు అంటున్నారు. బ్యాంకు రుణం కంతులు, సాధారణ పొదుపునకు సంబంధించిన ఖాతా వివరాలు మాత్రమే తెలుసని అంటున్నారు. అత్యవసర సమయంలో రుణం అడిగితే ఇస్తున్నారు, అయితే అది సాధారణ పొదుపు నుంచా లేక ఎస్ఎల్ఎఫ్ పొదుపు నుంచా అనే వివరాలు ఏవీ తమకు తెలియదని అంటున్నారు. కాగా బ్యాంకు నుంచి తీసుకున్న రుణం పొందినపుడు రూ.1000 నుంచి రూ.3000 దాకా ఆర్పీలు డిమాండ్ చేస్తుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రాతపూర్వకంగా పై అధికారులకు ఇచ్చే ధైర్యం చేయలేకున్నామని చెబుతున్నారు. ఎందుకంటే మధ్యతరగతి కుటుంబాలకు ఎంతోకొంత కుటుంబ అవసరాలు తీర్చుకోవడం లేదా స్వయం ఉపాధిని మరింత విస్తరించుకునేందుకు డ్వాక్రా రుణాలు సహాయ పడుతున్నాయని చెబుతున్నారు.

### ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం

**- రాజేశ్వరి, సీఎంఎం, మెప్మా పులివెందుల**

ఎస్ఎల్ఎఫ్ పొదుపు రుణాల గురించి మాకు ఇంతవరకు ఫిర్యాదు రాలేదు. ఏ గ్రూప్‌లో అయితే అవకతవకలు జరుగుతున్నాయో వారు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

## రాజంపేటలో సుగవాసి సోదరుల సుడిగాలి పర్యటన



ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడుతో రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం



మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల శ్రీవాణి కుటుంబసభ్యులతో భేటీ అయిన సుగవాసి ప్రసాద్‌బాబు

రాజంపేటటౌన్, ఏప్రిల్ 4: రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, ఆయన సోదరుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు సుడిగాలి పర్యటన చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మొదటిసారిగా రాజంపేటకు వచ్చిన వారిరువురు పలువురితో భేటీ అయ్యారు.

రాజంపేట మాజీ మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు కొండయ్యనాయుడు, రాజంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల శ్రీవాణి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మల్లెల సుబ్బరాయుడు, యువ నాయకులు మల్లెల సురేంద్ర కుటుంబీకులతో మాట్లాడారు. అలాగే నందలూరులో ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, నందలూరు మాజీ ఎంపీపీ పల్లె సుబ్రమణ్యం, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల ప్రకాష్, రాజంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్, రాజంపేట మండల సీనియర్ నాయకులు, కూచివారిపల్లెకు చెందిన వెంకటయ్యనాయుడు, మాజీ మండల ఉపాధ్యక్షులు రామనరసింహులు, టెక్స్‌మో మల్లి, హత్యరాల దేవస్థాన మాజీ చైర్మన్ బండారు బాలయ్య, మన్నూరు నాయకులు మురళీకృష్ణ, టీడీపీ మహిళానేత మిరియాల జ్యోతి, కౌన్సిలర్ చెంగమ్మ, తదితరులతో వారిరువురు భేటీ అయ్యారు.

## శవ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ జగన్

- *నాడు బాబాయి హత్య.. నేడు అవ్వాతాతలను చంపి రాజకీయం*
- *టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి*

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 4: శవ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డిలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. నాడు బాబాయి వైఎస్ వివేకా హత్య, నేడు అవ్వతాతల్ని చంపి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. శవం ఎక్కడ ఎప్పుడు దొరుకుతుందా, రాజకీయం చేద్దాం అనేలా జగన్‌రెడ్డి తయారయ్యారన్నారు. జోగి రమేశ్ చేత చనిపోయిన వృద్ధురాలితో రాజకీయం చేయాలని ప్రయత్నించాడని బాధిత కుటుంబం ఛీవాట్లుపెట్టి తరిమికొట్టిందన్నారు. బాధల్లో ఉన్న వారిని ఓదార్చడం మాని వారితో కూడా శవ రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఖజానాలో నిధులు లేకనే పింఛన్లు పంపిణీ చేయలేదని తెలిపారు. ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీకి కలెక్టర్లు సరేనన్నా దానిని వ్యతిరేకిస్తున్న సెర్ప్ సీఈవో మురళీధర్ రెడ్డిని వెంటనే ఆ బాధ్యతల నుంచి ఎన్నికల కమిషన్ తప్పించాలన్నారు. పింఛను సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు 13 వేల కోట్లు మార్చి 16 నుంచి 30 మధ్య పదిహేను రోజుల్లోనే ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా సొంత కాంట్రాక్టర్లకు జగన్‌రెడ్డి దోచి పెట్టారన్నారు. సచివాలయ సిబ్బంది గ్రామకార్యదర్శులతో ఇంటి వద్దనే పింఛను పంపిణీ చేయకపోవడానికి నిధులు కొరతనే కారణం కానీ ఎన్నికల కమిషన్, తెలుగుదేశం కాదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచి పన్నులు మోది, ధరల వాత పెట్టి ఐదేళ్లలో పెంచింది వెయ్యి మాత్రమేన్నారు. టీడీపీ ప్రభుత్వం పింఛనుదారులకు నెలకు రూ.4వేల చొప్పున ఇంటి వద్దకే పంపిణీ చేస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు.

## శ్రీనివాసులు హత్య దోషులను శిక్షించే వరకు పోరాటం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 4: మండలంలోని యాదవాపురం గ్రామానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులు యాదవ్‌ను హత్య చేసిన వారిని, హత్యకు కారకులైన దోషులందరినీ శిక్షించేవరకు పోరు ఆపే ప్రసక్తే లేదని పలువురు నాయకులు తేల్చిచెప్పారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్, అఖిల భారత యాదవ మహా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాదేవి గంగయ్య యాదవ్, మృతుడి తల్లిదండ్రులు, బంధువులతో కలిసి మాట్లాడారు. పెండ్లిమర్రి మండలం దాసరిపల్లె పొలంలో 2003 సంవత్సరంలో కొత్తపల్లెకు చెందిన జి.సుబ్బారెడ్డి, జి.రామసుబ్బారెడ్డి వద్ద నుంచి 5 ఎకరాల 10 సెంట్ల భూమిని మృతుడి తండ్రి ఆదిమూలం చిన్న సుబ్బరాయుడు కొనుగోలు చేశారన్నారు. ఆ భూమి తాలూకు అన్ని డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ ఆ భూమిలో మాకు కూడా 70 సెంట్ల భూమి ఉందని కొత్తపల్లెకు చెందిన జి.పుల్లారెడ్డి, అతడి అనుచరులు నిత్యం చిన్న సుబ్బరాయుడు కుటుంబంతో గొడవ పడుతుండేవారన్నారు. ఆ భూవివాదాన్ని పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత తహశీల్దార్, కలెక్టర్‌కు చిన్నసుబ్బరాయుడు విన్నవించుకున్నప్పటికీ స్పందన లేదన్నారు.

ఇదిలా వుండగా పెద్దలతో పెట్టుకోవద్దని, వాళ్లు కమలాపురం ఎమ్మెల్యే అనుచరులు, అధికార పార్టీ నాయకులని సర్దుకుపోవాలని అప్పటి తహశీల్దార్ పదే పదే చిన్నసుబ్బరాయుడు కుటుంబానికి చెప్పినట్లు వెల్లడించారు. కాగా ఆ భూమిని సర్వే చేయించాలని, సర్వేలో ఎవరికి వస్తే వారే తీసుకోవచ్చని చిన్న సుబ్బరాయుడు చెప్పి డబ్బులు కూడా చెల్లించినప్పటికీ సర్వే చేయడానికి వచ్చే ప్రతి సందర్భంలో పుల్లారెడ్డి అడ్డుపడుతూ ప్రస్తుతం డాక్యుమెంట్లు మా వద్ద లేవని కాలయాపన చేశారని ఆరోపించారు. ఒకానొక సందర్భంలో పుల్లారెడ్డి అనుచరులు మారణాయుధాలతో చిన్నసుబ్బరాయుడు కుటుంబంపై దాడికి ప్రయత్నించా రన్నారు. దీనిపై పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా అక్కడి ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి కూడా స్పందించకపోగా వాళ్లు అధికార పార్టీ నాయకులు, ఎమ్మెల్యే అనుచరులంటూ బాధితులనే భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. ఇటు జిల్లా ఉన్నతాధికారులు, అటు పెండ్లిమర్రి అప్పటి తహశీల్దారు ఉదయభాస్కర్‌రాజు, ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి స్పందించి ఉంటే శ్రీనివాసులు హత్యకు గురయ్యేవాడు కాదన్నారు. హత్యకు పరోక్షంగా కారకులైన తహశీల్దార్, ఎస్ఐని నిందితులుగా చేర్చి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగా సురేష్, యాదవ సంఘం నాయకులు రెడ్డయ్య యాదవ్, మల్లికార్జునయాదవ్, విజయ్‌కుమార్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ఉత్పత్తుల కోసం 'వేగ'

- *ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి*



వేగ రైతు ఉత్పత్తిదారుల కంపెనీని ప్రారంభిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 4 : నాణ్యమైన ఉత్పత్తుల కోసం వేగ రైతు ప్రొడ్యూసర్ సంస్థ పనిచేస్తుందని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వేగ రైతు ఉత్పత్తిదారుల కంపెనీని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ వినూత్నమైన వ్యవసాయ పరిజ్ఞానం కోసం, నాణ్యమైన అధిక వ్యవసాయ ఉత్పతుల కోసం వేగ కంపెనీ పనిచేస్తుందని చెప్పారు. రైతుల చేత రైతుల కొరకు ఏర్పాటు చేస్తున్న అతి పెద్ద రైతు ఉత్పత్తిదారుల కంపెనీ వేగ కంపెనీ అన్నారు. త్వరలోనే యాభై ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీ స్పష్టం చేశారు. కొత్త ఆలోచనతో వేగ రైతు ప్రొడ్యూసర్ సంస్థను రాజశేఖర్‌రెడ్డి తీసుకుని రావడం జరిగిందని చెప్పారు. రైతులు సాగుచేసే పంటలకు విత్తనాలు, ఎరువులు ఇవ్వడంతో పాటు పంటలకు ఎంతశాతంలో నీరు కట్టాలి అనే వాటిపై కూడా అవగాహన కల్పిస్తారని తెలిపారు. దిగుబడి వచ్చిన తర్వాత పంటను వారే గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేస్తారని చెప్పారు. వేంపల్లెలో వేగ రైతు ఉత్పత్తిదారుల కంపెనీని ఏర్పాటు చేయడం సంతోషకరమని చెప్పారు. వేంపల్లెలో విజయవంతం అయితే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అన్ని పంటలకు ఇలాంటి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. రైతులకు ప్రయోజనకరంగా ఉండే విధంగా వేగ కంపెనీ ముందుకు రావాలని కోరారు. అనంతరం వేగ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్పత్తులను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో సరైన ధరకు విక్రయించడానికి ధరలు పూర్తిగా పడిపోయినప్పుడు ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా ఉత్పత్తులను తయారుచేసి గిట్టుబాటు ధర పొందడం కోసం వేగ కంపెనీలో సభ్యత్వం ఉండాలని కోరారు. కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్, చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

## బీసీల అభివృద్ధే టీడీపీ ధ్యేయం



మాట్లాడుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి

వల్లూరు, ఏప్రిల్ 4: ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే న్యాయం జరిగిందని వల్లూరు టీడీపీ మండలాధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బీసీ జయహో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు ఎన్నడూ లేని విధంగా టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో ప్రయోజనాలు కల్పించిందన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం బీసీలకు ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. రాబోవు ఎన్నికల్లో బీసీలంతా ఏకమై టీడీపీకి ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఓబులేసుయాదవ్, వెంకటసుబ్బయ్య, రవికుమార్, పుల్లగూర శ్రీనివాసులు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీకి పట్టుగొమ్మలు బీసీలే

చెన్నూరు, ఏప్రిల్ 4: రాష్ట్రంలో టీడీపీ అభివృద్ధిలో పట్టుగొమ్మలుగా బీసీలు నిలచారని టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఆటోబాబు అన్నారు. స్థానిక పార్టీ ర్యాలయంలో గురువారం ఆయన బీసీలతో సమావేశం నిర్వహించారు. మండలంలో బీసీల శాతం ఎక్కువ ఉందని, రాబోవు ఎన్నికల్లో ఐక్యతగా టీడీపీని గెలిపిం చాలని కోరారు. మండల బీసీ నేతలు శ్రీనివా సులు, కొక్కిరాయపల్లె సర్పంచ్ సూర్యనారాయణ, రాచి న్నాయపల్లె మాజీ సర్పంచ్ సెట్టరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశాల వేతనాలపై నిర్లక్ష్యం తగదు

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 4: ఆశా కార్యకర్తలకు ఇవ్వాల్సిన మార్చి నెల వేతనాల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి త్వరితగతిన వేతనాలను చెల్లిం చాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌర వాధ్యక్షుడు గుంటి వేణు గోపాల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రూ.10 వేల జీతం వస్తోంది కదా.. అందులో నుంచి రూ.3,500 ఖర్చుపెట్టి రికార్డులు కొనాలని సంబంధిత నోడల్ ఆఫీసర్లతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు ఆశా కార్యకర్తలను బెదిరిస్తున్న తీరు సరైందికాదన్నారు. ఇక ఈనెల 9న ఉగాది, 11న రంజాన్, 17న శ్రీరామనవమి పండుగలు వున్నా ఇంత వరకు వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమ న్నారు. తక్షణమే వేతనాలు చెల్లించకపోతే ఆందోళన చేపడతాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.శాంతమ్మ, కోశాధికారి అమ్ములు, ఉపాధ్యక్షురాలు పి. అనసూయ, తదితరులు పాల్గొన్నారు

## 'వైసీపీ బలిజ సమావేశాన్ని బహిష్కరించండి'



విలేకరులతో మాట్లాడుతున్న చెన్నంశెట్టి మురళి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 4: కడప నగరంలో శుక్రవారం జరిగే వైసీపీ బలిజ కులస్థుల సమావేశాన్ని బలిజ సోదరులు బహిష్కరించాలని టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి చెన్నంశెట్టి మురళి పిలుపునిచ్చారు. గురువారం కడప నగరంలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ కాపు నేస్తం పేరిట బలిజలను మోసం చేసిం దని ఆరోపించారు. తనలాంటి నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరడానికి ఇదో ప్రధాన కారణమన్నారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికల సమయం ఆసన్నం కావడంతో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేష్‌బాబు, ఎంపీ అవినాష్‌రెడ్డి కలిసి మరోమారు బలిజ కులస్థులను బూటకపు హామీలతో బురిడీ కొట్టించే ప్రయ త్నం చేస్తున్నారన్నారు.

## టీడీపీలో పలువురికి పదవులు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 4: రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు కడప నగరంలో పలువురికి వివిధ పదవులు కేటాయిస్తూ నియామక పత్రాలు అందించినట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. టీడీపీ నగర వాణిజ్య విభాగం మహిళా అధ్యక్షురాలిగా కోట విజయలక్ష్మి, నగర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా నరసింహులు, నగర తెలుగు రైతు ఉపాధ్యక్షుడిగా రామిరెడ్డి ఓబులరెడ్డిని నియమించినట్లు తెలిపారు.

## మెరుగు పేరుతో మోసగించిన ఇద్దరి అరెస్టు

చాపాడు, ఏప్రిల్ 4: బీహార్ రాష్ట్రంలోని మహరంపూర్, రఘుమిద్‌పూర్ ప్రాంతాలకు చెందిన అజయ్‌కుమార్, గణేష్‌కుమార్‌ను గురువారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాజుపాళెం గ్రామంలోని దళితవాడలో ఈనెల 3న వీరు జాకెట కీర్తి అనే మహిళకు సంబంధించిన బంగారు ఆభరణాలకు మెరుగుదిద్దుతామని చెప్పి మోసం చేసినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

# పింఛన్ల పంపిణీకి డబ్బులు లేకనే టీడీపీపై బురద

● పులివెందుల ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి



ఎగువపల్లెలో పథకాల కరపత్రాన్ని అందిస్తున్న బీటెక్ రవి

లింగాల, ఏప్రిల్ 4: అసత్య ప్రచారాన్ని వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వైసీపీ నెంబర్ వన్ అని పులివెందుల అసెంబ్లీ ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) విమర్శించారు. గురువారం లింగాల మండలంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా పార్నపల్లె సమీపంలో ఉన్న కోనమల్లేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఎగువపల్లెలో ఇంటింటికి వెళ్లి టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి మేనిఫెస్టో వివరించారు. పలువురు వృద్ధులు ఇంటింటికి వచ్చే పింఛన్ ఈనెల రాలేదని, రైతుల పరిస్థితి బాగోలేదని తమ అసంతృప్తిని వెలిబుచ్చారు.

ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ పింఛన్ నగదు బ్యాంకుల్లో జమ కాలేదని.. దీనిని కప్పిపుచ్చుకోవడం కోసం టీడీపీపై బురదజల్లే కార్యక్రమాలు మొదలుపెట్టారన్నారు. టీడీపీ వాళ్లు అడ్డుకుంటు న్నారని పింఛన్‌దారులతో చెబుతున్నారని అన్నారు. ఈసందర్భంగా రైతులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను బీటెక్ రవికి వివరిం చారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే అందరికి న్యాయం చేకూ రుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, నాయకురాలు సుష్మ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, షబ్బీర్, విశ్వనాథరెడ్డి, అమర్ తదితర టీడీపీ, జనసేన, బీజేపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అరాచకపాలనకు అంతం తప్పదు

● కడప టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి



అక్కాయపల్లెలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కడప నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 4: రాష్టంలో అరాచక పాలనకు అంతం తప్పదని కడప నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. గురువారం కడప నగరం 46వ డివిజను అక్కాయపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలు పంచిపెట్టారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దిగజారి పోయిందన్నారు. ఒక్కపరిశ్రమ రాక నిరుద్యో గులకు ఉద్యోగాలు లేక యువత పక్క రాష్ట్రాల వైపు వెళుతున్నారని ఆరో పించారు. మళ్లీ రాష్ట్రం అభివృద్ధి దిశలో వెళ్లాలంటే చంద్రబాబు సీఎం కావాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటుతో విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జాకీర్, శివ, యూసఫ్, మల్లి పాల్గొన్నారు.

**టీడీపీలో భారీగా చేరికలు :** కడప నగరం ద్వారకనగర్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి నివాసంలో భారీగా టీడీపీలో చేరికలు జరిగాయి. మాజీ కార్పొరేటర్లు చైతన్య, సురేష్, రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు డివిజన్లకు సంబంధించిన స్థానికులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీ టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే టీడీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాత కడప క్రిష్టారెడ్డి, సుబ్బారెడ్డి, నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు

## ఎన్నికల కమిషన్ ఆదేశాలు విస్మరిస్తున్న సిబ్బంది

● పెన్షనుదారుల ఆగ్రహం



కార్యాలయం ముందు ఎదురుచూస్తున్న పింఛన్‌దారులు

ఖాజీపేట, ఏప్రిల్ 4: సచివాలయ సిబ్బంది తీరుతో సామాజిక పింఛనుదారులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే... ఖాజీపేట-2, కూనవారిపల్లె, బి.కొత్తపల్లె పంచాయతీల్లోని సచివాలయ సిబ్బంది ఆలస్యంగా కార్యాలయాలకు వస్తున్నారు. దీంతో ఉదయం ఎనిమిది గంటలకే ఎదురు చూస్తున్న పింఛనుదారులు నీరు.. నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఖాజీపేట సచివాలయంలో ఈ పరిస్థితి మరీ తీవ్రంగా ఉంది. కాగా., పరిస్థితిని గమనించిన ఎంపీడీవో తాగునీటి సౌకర్యం కల్పించి ఊరట కల్పించారు.. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పింఛన్ పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా 10.30 గంటల తర్వాతే అధికారులు కార్యాలయానికి రావడంపై పింఛనుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## ఉచిత విద్య వైద్యం అందించడమే ఐపీసీ లక్ష్యం

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 4: రాష్ట్రంలోని ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడమేలక్ష్యంగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ (ఐపీసీ) పనిచేస్తుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పద్మాకర్ జాక్ స్పష్టం చేశారు. గురువారం కడప నగరంలోని దక్షిణాదిరాష్ట్రాల ప్రధాన కార్యాలయాలయాన్ని స్టార్ క్యాంపెయినర్ శివపావనితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రానికి వైసీపీ చేసింది శూన్యమన్నారు. కనీసం గుండెజబ్బులకు చికిత్స అందించే వైద్యులను నియమించలేకపోయారన్నారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్‌పార్టీ వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. కడప ఎంపీ, పులివెందుల, కుప్పం అసెంబ్లీ స్థానాల్లో పద్మాకర్ బరిలో నిలుస్తున్నట్లు తెలిపారు.

## పెండ్లిమర్రి ఎస్ఐ సస్పెన్షన్

కడప (క్రైం), ఏప్రిల్ 4: విధుల పట్ల అలసత్వం, క్రమశిక్షణ ఉల్లంఘించిన పెండ్లిమర్రి ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు తెలిపారు. ఆ మేరకు గురువారం ఉత్త ర్వులు జారీ అయ్యాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యా దుల పట్ల సకాలంలో స్పందించి సరైన చర్యలు తీసు కోవడంలో నిర్లక్ష్యం వహించిన ఎస్ఐపై శాఖాపరంగా చర్యలు తీసుకున్నారు. ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎస్ఐని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆటో - స్కూటరు ఢీ యువకుడికి తీవ్ర గాయాలు



కడప (క్రైం), ఏప్రిల్ 4 : కడప నగరంలోని సెయింట్ జోసెఫ్ స్కూలు సర్కిల్ వద్ద గురువారం ఉదయం వాటర్ సప్లై ఆటో స్కూటరు ఢీకొనడంతో ఊటుకూరుకు చెందిన కార్తీక్ అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించి గాయపడ్డ యువకున్ని హాస్పిటల్‌కు తరలించారు. ఈమేరకు బాధితుడు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# నేతలకు చెలగాటం.. ప్రయాణికులకు ప్రాణ సంకటం!

● సిద్ధం సభలకు 41 బస్సుల తరలింపు ● ఎండలో ప్రయాణికుల ఎదురు చూపులు



ఆర్టీసీ బస్సులకోసం ఎండలో వేచివున్న ప్రయాణికులు

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 4: ఆర్టీసీ బస్సుల్లో అధిక భాగం సిద్ధం సభలకు తరలించడంతో ప్రయాణికులు రోడ్లపై ఎండల్లో గంటల తరబడి ప్రయాణికులు అగచాట్లు పడ్డారు. వేసవి కాలం కావడంతో ఉదయం 9 నుండే ఎండలు మండిపోతున్నాయి. దీనికి తోడు పట్టణంలో ఎక్కడా ప్రధాన రోడ్లపై ఆర్టీసీ బస్‌స్టాపుల వద్ద నీడ వసతి లేదు వైసీపీ సిద్ధం సభలకోసం ఆర్టీసీ బస్సులను ప్రతి డిపో నుంచి బస్సులు తీసుకెళ్లడంతో ఆ డిపోల్లో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రొద్దు టూరు డిపోలో సిద్ధం సభలకోసం 41 బస్సులను తరలించడంతో ప్రయాణిలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ముఖ్యంగా కొన్ని పల్లెల రూట్లలో బస్సులు అసలు వెళ్లలేదు. కడప - ప్రొద్దుటూరు మార్గంలో ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు సర్వీసు ఉండాల్సి ఉండగా, ప్రతి 30 నిమిషాలకు ఒక సర్వీసు నడిపారు. దీంతో ప్రయాణికులు ఎండలో అగచాట్లు పడ్డారు.

## టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం



రామనపల్లెలో పుత్తా సరళమ్మ, శ్రీచైతన్యల ప్రచారం

చెన్నూరు, ఏప్రిల్ 4: తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని.. టీడీపీని ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహా రెడ్డి సతీమణి పుత్తా సరళమ్మ, పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సతీమణి శ్రీచైతన్య అన్నారు. మండలంలోని రామనపల్లెలో గురువారం బాబుతోనే భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలనలో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందరి భవిష్యత్తు బాగుపడాలంటే టీడీపీకి ఓట్లు వేయాలని కోరారు. కమలాపురం నియోజకవర్గంలో నిత్యం అందుబాటులో ఉండే పుత్తా కుటుంబాన్ని గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం వారు అనంతరం చెన్నూరు నారాయణరెడ్డి వీధిలో టీడీపీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో దివంగత టీడీపీ నేత జ్యోతిరెడ్డి సతీమణి శివకుమారి, బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి సుబ్ర మ ణ్యం, టీడీపీ నేతలు అక్బర్, కత్తి లక్ష్మయ్య, శెట్టిపల్లె శివారెడ్డి, ముండ్ల నరసింహారెడ్డి కె.క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భువనేశ్వరిని కలిసిన టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు



నారా భువనేశ్వరిని కలిసిన టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 4 : నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా గురువారం కడపకు విచ్చేసిన నారా భువనేశ్వరిని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్య క్షుడు బొజ్జ తిరుమలేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేటశివ, ఏటూరి లోకేశ్, విశ్వనాథ్, అక్షయకుమార్‌రెడ్డి, శ్రీనులు కలిశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి నాయకత్వంలో కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ జెండా ఎగరవేయడంలో యువత, విద్యార్థులు కీలకంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. చైతన్యవంతమైన యువత విద్యార్థులు మాకు విజనరీ లీడరు కావాలి, ప్రిజనరీ లీడరు వద్దు, ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ అని ముక్తకంఠంతో నినదిస్తున్నారని తెలిపారు.

## బాబు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



జగ్జీవన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 4: స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని.. ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి తెలిపారు. గురువారం వైవీయూలో బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన జగ్జీవన్‌రామ్ అకుంఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగిన తీరు స్ఫూర్తిదా యకమన్నారు. భారత ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి సామా జిక న్యాయం కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కామర్స్ లా అండ్ మేనేజ్‌మెంటు డీన్ ప్రొఫెసరు సుబ్బరాయుడు, డాక్టర్ వెంకట్రామ్, బోధనేతర సిబ్బది పాల్గొన్నారు.

## కడపలో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కడప (క్రైం), ఏప్రిల్ 4: ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు కడప తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం పోలీసులు ప్లాగ్‌మార్చ్ నిర్వహించారు. తాలుకా సీఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ తిరుపాల్‌నాయక్ కేంద్ర బలగాలతో ప్లాగ్‌మార్చ్ నిర్వహించారు. నగరంలోని రవీంద్రనగర్, నబీకోట, కాగితాలపెంట, ఐటీఐ సర్కిల్ మీదుగా ప్లాగ్‌మార్చ్ సాగింది.



# కడప నగరం విద్యార్థులకు సూపర్ 30 కార్యక్రమం

● ఐఐటి, నీట్ పోటీ పరీక్షలకు శిక్షణ
● రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 12 వరకు గడువు
● ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు
● ఆర్‌జేడీ వై.రాఘవరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ రాఘవరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 4: కడప నగరం ప్రభుత్వ పాఠశాలల విద్యా ర్థులకు సూపర్ 30 అనే ప్రత్యేక కార్యక్రమం రూపొందించినట్లు ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. ఐఐటీ, నీట్ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గురువారం కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈసంవత్సరం పదో తరగతి పరీక్షలు రాసిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఒక ప్రత్యేకమైన శిక్షణ కల్పించేందుకు సూపర్ 30 కార్యక్రమం రూపొందించామ న్నారు. ఈకార్యక్రమం ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. కొంత మంది మేధావుల సహకారంతో నిర్వహి స్తున్నామన్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదవే విద్యార్థులు పేదరికం ద్వారా ఉన్నత చదువులు చదవలేని పరిస్థితుల్లో ఉంటారని చెప్పారు. అటువంటి విద్యార్థులకు ఉచితంగా శిక్షణ కల్పిస్తే ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో రాణిస్తారన్నది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ నేప ద్యంలో ఐఐటీలో 30 మంది విద్యార్థులకు, నీట్‌లో 30 మందికి ప్రత్యేక శిక్షణ కల్పించేందుకు ఈ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీనికి జిల్లా విద్యాశాఖ, కడప మండల విద్యాశాఖ సంపూర్ణ సహకారం అందిస్తు న్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఈ శిక్షణ కోసం ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కడప జయనగర్‌కాలనీ, జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులను కలిసి తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమో దు చేసుకోవాలని సూచించారు. వంద శాతం రోస్టరు ప్రకా రం ఎంపికలు నిర్వహిస్తామని చెప్పారు.

ఈ ఎంపికల కోసం నిర్వహించే పరీక్షను త్వరలో ప్రకటిస్తామన్నారు. వేసవి సెలవుల్లో ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య ఫౌండేషన్ కోర్సు నిర్వహిస్తామన్నారు. జూన్ 12 నుంచి సాయంత్రం 5 నుంచి 8గంటల మధ్యలో 3 గంటల పాటు తరగతులు ఉంటాయన్నారు. వర్చువల్ మోడ్‌లో క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు. బెంగు ళూరు నారాయణ, చైతన్యలో పనిచేసే ప్రత్యేక బోధ కులు ఆన్‌లైన్ ద్వారా క్లాసులు లైవ్‌లో నిర్వహిస్తారని చెప్పారు. అలాగే స్థానికంగా ఉన్న అధ్యాపకులు కూడా కొన్ని తరగతులను విద్యార్థులకు చెప్పే అవకాశం కూడా ఉందన్నారు. అలాగే 30 మందిలో ఒక సీటు ప్రెస్ వారి పిల్లల కూడా కేటాయించడం జరుగుతుందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో డబ్బులు కట్టి చదవలేని విద్యార్థులకు మంచి అవకాశమని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కడప, ప్రొద్దుటూరు ఉప విద్యాధికారులు రాజగోపాల్‌రెడ్డి, క్రిష్ణప్రసాద్, కడప ఎంఈవో పాలెం నారాయణ పాల్గొన్నారు.

## కొండాపురం నేతలతో మాజీ మంత్రి ఆది భేటీ



తాళ్లప్రొద్దుటూరులో బీజేపీ నేతలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి

కొండాపురం, ఏప్రిల్ 4: మండలంలోని టీడీపీ, బీజేపీ నేతలను గురువారం జమ్మలమడుగు బీజేపీ అభ్యర్థి మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి తాళ్లప్రొద్దుటూరులో కలిశారు. రాబోయే ఎన్నికల్లో కూటమి గెలుపునకు కృషిచేయాలని కోరారు. శుక్రవారం జమ్మలమడుగులో జరిగే ఎన్డీఏ ఉమ్మడి సమావేశానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, టీడీపీ, బీజేపీ నాయకులు గండ్లూరు శంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, రామాంజులరెడ్డి, నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు

బద్వేలు టౌన్, ఏప్రిల్ 4 : రంజాన్ మాసం పురస్కరించుకుని గురువారం సాయంత్రం పట్టణంలోని ముస్లింలకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిగ్‌బాస్, పీఆర్‌బాషా, జహంగీర్‌బాషా, షరీఫ్, హుసేన్‌పీరా, మిత్తికాయల రమణ, సిమెంటు షరీఫ్, అలంగీర్, సిరాజుద్దీన్, రసూల్, ముస్లింసోదరులు పాల్గొన్నారు.

## పింఛనుదారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

అట్లూరు, ఏప్రిల్ 4 : అట్లూరు మండల సచివాలయంలో గురువారం పింఛనుదారులకు మండల టీడీపీ ఇన్‌చార్జి రెడ్డయ్య, మండల యువ నాయకులు జయకృష్ణారెడ్డి, వరికుంట సర్పంచ్ రమణ, ఈశ్వర్‌రెడ్డి, ఈటె మస్తాన్, పి.నరసింహులు, కాసల అయ్యవారయ్య, టీడీపీ కార్యకర్తలు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులను టీడీపీ నాయకులు తమ వాహనాల్లో ఇంటి వద్దకు తరలించారు.



# ఇవీ.. అభివృద్ధికి సూచికలు



కంకర తేలి ప్రమాదకరంగా మారిన రోడ్డు



కూరగాయల మార్కెట్ వద్ద గుంతలు పడిన రోడ్డు

జమ్మలమడుగు, ఏప్రిల్ 4: రహదారులు అభివృద్ధికి చిహ్నాలంటారు. జమ్మలమడుగు పట్టణంతోపాటు, నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే రోడ్లను పరిశీలిస్తే ఈ ప్రాంతంలో అభివృద్ధి ఏమేరకు జరిగిందనే విషయం తేటతెల్లమవుతుంది. జమ్మలమడుగు నియోజకవర్గ కేంద్రం మోరగుడి నుంచి ప్రధాన రోడ్డు అధ్వానంగా మారింది. ఎస్.ఉప్పలపాడు గ్రామం వద్ద నుంచి కోవెలకుంట్లకు వెళ్లేదారి, గుండ్లకుంట గ్రామం తదితర ప్రాంతాల్లో ప్రధాన రోడ్డు కంకర తేలింది. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలపాలవుతున్నారు. రోడ్డు దారుణంగా ఉన్నా, అధికారులకుకానీ, ప్రజాప్రతినిధులకుకానీ పట్టనట్లుగా ఉన్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**మున్సిపాలిటీలో..**

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతంలో రోడ్డు పక్కన రోడ్డు గుంతలు దర్శనమిస్తున్నాయి. అక్కడి నుంచి పాత బస్టాండు వరకు గుంతలు పడి, కొన్ని చోట్ల నెర్రలు చీలి వాహనదారులకు సమస్యగా మారింది. . ఇదే దారిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర అధికారులు ఎన్నోసార్లు వెళ్లారు కానీ, ఎవరూ పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు

# సామాజిక పింఛన్ల పంపిణీలో జాప్యం తగదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 4 : సామాజిక పింఛన్ల పంపిణీలో జాప్యం తగదని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హితవు పలికారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అబ్ధిదారుల ఇళ్ల వద్దకు సచివాలయ ఉద్యోగులు నేరుగా వెళ్ళి పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నా- ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా సచివాలయాలవద్దకు రప్పిస్తోందన్నారు. సచివాలయాల వద్ద వృద్ధులు ఇబ్బందులు పడితే, అదంతా టీడీపీపై నెట్టడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. ప్రొద్దుటూరులోని ఈశ్వర్‌రెడ్డి నగర్, పెన్నా నగర్‌లో ఇంకా వలంటీర్లే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఆరోపించారు. రాచమల్లు ప్రసాద్‌రెడ్డికి షర్మిలా రెడ్డిపై మాట్లాడే అర్హతలేదన్నారు. వైఎస్ కుటుంబంతో ఆయనకేం సంబంధమని, అవినాష్ రెడ్డికి ఎందుకు అంత భరోసా ఇస్తున్నావని ప్రశ్నించారు.. వివేకానంద రెడ్డి హత్యలో అవినాష్ రెడ్డి ఆయన కుటుంబం పాత్ర ఏమిటో ప్రపంచం అంతా తెలుసన్నారు. నిందితుడు దస్తగిరి అప్రూవర్‌గా మారి హత్య ఎవరు చేయించారు, ఎవరెవరు ఇందులో పాల్గొన్నారో సీబీఐ ముందు పూసగుచ్చినట్టు చెప్పాడన్నారు. అవినాష్ రెడ్డిని సీబీఐ అరెస్టు చేయకుండా జగన్ కేంద్రం ముందు మోకరిల్లి కాపాడుకున్నాడన్నారు. ప్రొద్దుటూరులో రాచమల్లు బంగారు రెడ్డి కిరణ్‌రెడ్డి అవినీతి అక్రమాలపై త్వరలో ప్రజలకు కరపత్రాల ద్వారా ప్రజలకు వివరిస్తామన్నారు. వరదరాజులరెడ్డి మీద బురద జల్లడం అంటే సూర్యుని మీద ఉమ్మినట్టే నన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు , జడ్పీటీసీ మాజీ సభ్యుడు తోట మహేశ్వరరెడ్డి , బద్వేలు వాసు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్ ఆదేశాలు విస్మరిస్తున్న సిబ్బంది

● పెన్షనుదారుల ఆగ్రహం



కార్యాలయం ముందు ఎదురుచూస్తున్న పింఛన్‌దారులు

ఖాజీపేట, ఏప్రిల్ 4: సచివాలయ సిబ్బంది తీరుతో సామాజిక పింఛనుదారులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే... ఖాజీపేట-2, కూనవారిపల్లె, బి.కొత్తపల్లె పంచాయతీల్లోని సచివాలయ సిబ్బంది ఆలస్యంగా కార్యాలయాలకు వస్తున్నారు. దీంతో ఉదయం ఎనిమిది గంటలకే ఎదురు చూస్తున్న పింఛనుదారులు నీరు.. నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఖాజీపేట సచివాలయంలో ఈ పరిస్థితి మరీ తీవ్రంగా ఉంది. కాగా., పరిస్థితిని గమనించిన ఎంపీడీవో తాగునీటి సౌకర్యం కల్పించి ఊరట కల్పించారు.. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పింఛన్ పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా 10.30 గంటల తర్వాతే అధికారులు కార్యాలయానికి రావడంపై పింఛనుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



కల్లుట్ల పంచాయతీలో ఇంటి వద్దకు వెళ్లి వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి చంద్రయ్య

## ఎట్టకేలకు ఇళ్లవద్దనే పింఛన్ల పంపిణీ

మైలవరం, ఏప్రిల్ 4: మండలంలో పింఛన్ల పంపిణీ సాఫీగా సాగుతోంది. గురువారం ని కల్లుట్ల, టి.కమ్మవారిపల్లి, రేగడిపల్లి, కల్లుట్ల తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తదితర సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. నడవలేని వారి ఇండ్లకు వెళ్లి వేలిముద్రలు తీసుకుని వారికి పించన్ డబ్బులు అందజేశారు.



# నేతలకు చెలగాటం.. ప్రయాణికులకు ప్రాణ సంకటం

● సిద్ధం సభలకు 41 బస్సుల తరలింపు ● ఎండలో ప్రయాణికుల ఎదురు చూపులు



ఆర్టీసీ బస్సులకోసం ఎండలో వేచివున్న ప్రయాణికులు

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 4: ఆర్టీసీ బస్సుల్లో అధిక భాగం సిద్ధం సభలకు తరలించడంతో ప్రయాణికులు రోడ్లపై ఎండల్లో గంటల తరబడి ప్రయాణికులు అగచాట్లు పడ్డారు. వేసవి కాలం కావడంతో ఉదయం 9 నుండే ఎండలు మండిపోతున్నాయి. దీనికి తోడు పట్టణంలో ఎక్కడా ప్రధాన రోడ్లపై ఆర్టీసీ బస్‌స్టాప్‌ల వద్ద నీడ వసతి లేదు వైసీపీ సిద్ధం సభలకోసం ఆర్టీసీ బస్సులను ప్రతి డిపో నుంచి బస్సులు తీసుకెళ్లడంతో ఆ డిపోల్లో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రొద్దుటూరు డిపోలో సిద్ధం సభలకోసం 41 బస్సులను తరలించడంతో ప్రయాణిలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ముఖ్యంగా కొన్ని పల్లెల రూట్లలో బస్సులు అసలు వెళ్ళలేదు. కడప - ప్రొద్దుటూరు మార్గంలో ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు సర్వీసు ఉండాల్సి ఉండగా, ప్రతి 30 నిమిషాలకు ఒక సర్వీసు నడిపారు. దీంతో ప్రయాణికులు ఎండలో అగచాట్లు పడ్డారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

చాపాడు, ఏప్రిల్ 4: మైదుకూరు మండలంలోని నానుబాలపల్లెకు చెందిన పందిటి చెంచయ్య (56) అనే వ్యక్తి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. చాపాడు గ్రామం వద్ద ఉన్న కుందూ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అతనిని ప్రొద్దుటూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి నుంచి కర్నూలుకు తరలించగా . అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వారు తెలిపారు.

## ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగిపై దాడి

కొండాపురం, ఏప్రిల్ 4: రుణం ఇవ్వలేదన్న కోపంతో ఇద్దరు యువకులు ఓ ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగిపై దాడి చేసి గాయపరిచారు. స్థానిక ఆశీర్వాద్ గోల్డ్ ఫైనాన్స్ కంపెనీలో వెంకటేశ్వర్లు అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తమకు గోల్డ్‌లోన్ ఇవ్వలేదన్న కోపంతో సన్నీ, అనిల్ అనే యువకులు గురువారం అతనిపై దాడి చేసినట్లు కొండాపురం ఎస్సై యోగీంద్ర తెలిపారు. ఈ సంఘటనలో వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి .కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



## ఘనంగా విశ్వనాథరెడ్డి జన్మదిన వేడుకలు



విశ్వనాథరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 4 : ఆత్మీయులు, అభిమానులు శ్రేయోభిలాషులు, సన్నిహితుల మధ్య బద్వేలు నియోజకవర్గ నేత నల్లేరు విశ్వనాథరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. గురువారం పోరుమామిళ్లలోని ఆయన ఇంట్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏడు మండలాల్లోని నాయకులు, సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, గ్రామ స్థాయి నాయకులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. సాయి బాబా ఆలయం నుంచి గజమాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆయనను సన్మానించారు. విశ్వనాథరెడ్డి అందరి సమక్షంలో కేక్ కట్ చేశారు. జన్మదిన శుభాకాంక్షలు తెలప డానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాశినాయన జడ్పీటీసీ సభ్యుడు సత్య నారాయణ రెడ్డి, పోరుమామిళ్ల మండల నాయకులు బాలగుర్విరెడ్డి, కొరపాటిపల్లె సర్పంచ్ కాశిలక్ష్మి పాల్గొన్నారు.

## మెరుగు పేరుతో మోసగించిన ఇద్దరి అరెస్టు

చాపాడు, ఏప్రిల్ 4: బీహార్ రాష్ట్రంలోని మహరంపూర్, రఘుమిద్‌పూర్ ప్రాంతాలకు చెందిన అజ య్‌కుమార్, గణేష్‌కుమార్‌ను గురువారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాజుపాళెం గ్రామంలోని దళితవాడలో ఈనెల 3న వీరు జాకెట కీర్తి అనే మహిళకు సంబంధించిన బంగారు ఆభరణాలకు మెరుగుదిద్దుతామని చెప్పి మోసం చేసినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

## భువనేశ్వరికి 'బాబుతో నేను' పుస్తకం బహూకరణ



బాబుతోనే నేను పుస్తకాన్ని బహూకరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 4: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరికి నందమూరి యువసేవా సమితి నాయకులు బాబుతో నేను పుస్తకాన్ని బహూకరించారు. గురువారం పెద్దశెట్టిపల్లెకు వచ్చిన ఆమెకు పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నందమూరి యువసేవా సమితి అధ్యక్షుడు గోమేదికం సుదర్శన్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ 52 రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రార్థనా మందిరాల్లో పూజలు, చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించామన్నారు. వాటన్నింటిని పుస్తక రూపంలో రూపొందించి నారా భువనేశ్వరికి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీబీఎన్ ఆర్మీ నియోజకవర్గ ఇన్‌చార్జి సీజే వెంకటసుబ్బయ్య, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్, టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురప్పయాదవ్, తెలుగుయువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామూనాయుడు, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్బరాజు, జిల్లా ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి లక్ష్మి నరసింహ, టీడీపీ జిల్లా కార్యదర్శి సిద్దయ్య, తెలుగుయువత నాయకులు విమల్, సమర, నందమూరి యువసేవా సమితి కార్యదర్శులు సురేష్‌కుమార్, నాగభూషణం, చాంద్‌బాష, సురేష్, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టా సమక్షంలో వైసీపీ నేతలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన మన్నెరాంపల్లె వైసీపీ నాయకులు

దువ్వూరు ( మైదుకూరు), ఏప్రిల్ 4: మండలంలోని మన్నెరాంపల్లెలోని వైసీపీకి చెందిన దాదాపు 60 కుటుం బాల వారు గురువారం సాయం త్రం టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరా రు. గ్రామానికి చెందిన పెద్ద భోగాది, చిట్టిబోయిన సుబ్బకృష్ణ, ఆంజనే యులు, గంగాధర్, గంగారాజు తదితరుల చెందిన కుటుంబాల సభ్యులకు ఆయన శాలువ కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోరెడ్డి వెంకట రమణారెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు మాచనూరు సుబ్బరాయుడు, మల్లోత్ర తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న ఇంటింటి ప్రచారం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 4 : బద్వేలు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గు రువారం బొజ్జా రోశన్న ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గురు వారం ఆయన పోరుమామిళ్లలోని 54, 58 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. త్వరలో జరగబోయే శాసనసభ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు, బీజేపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఇంటింటి ప్రచారం



గంగనపల్లెలో ప్రచారంచేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, అభ్యర్థి రోశన్న

కాశినాయన ఏప్రిల్ 4: కమలం గుర్తుకు ఓటేసి బీజేపీ అభ్యర్థి బొజ్జా రోశన్న గెలిపించాలని బద్వేల్ మాజీ ఎమ్మెల్యే టీడీపీ నాయకురాలు కే. విజయమ్మ ప్రజలను కోరారు. గురువారం గంగనపల్లె గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఉమ్మడి మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రాజారెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, టీడీపీ నాయకులు హోండా రవీంద్రా రెడ్డి, రామసుబ్బారెడ్డి, రమణారెడ్డి, ఓ.రోహిత్‌రెడ్డి, డి.కృష్ణారెడ్డి, కొండా నరసింహారెడ్డి, నర్సాపురం సర్పంచ్ ఖాజావలి, బద్వేల్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు ఉట్టి శ్రీనివాసులు,నారాయణరెడ్డి, జనసేన పార్టీ నాయకులు పుల్లూరు ఖలీల్ ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బద్వేలు కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై పునః పరిశీలించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కమలమ్మ

పోరుమామిళ్ల, ఏప్రిల్ 4 : బద్వేలు కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై పునః పరిశీలించాలని బద్వేలు మాజీ ఎమ్మెల్యే కమలమ్మ కోరారు. గురువారం ఆమె ఇంట్లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొందరు నేతల కుట్ర కారణంగానే బద్వేలు నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ తనకు రాలేదన్నారు. 2009 నుంచి కాంగ్రెస్ పార్టీకి విధేయతగా ఉన్నానని, ఎన్నో ప్రలోభాలు పెట్టినా, పార్టీ అభివృద్ధికి కృషి చేశామన్నారు. ఇప్పటి కీ తన కుటుంబం మొత్తం కాంగ్రెస్‌నే నమ్ముకుని, ఆస్తులు అమ్ముకున్నామన్నారు. కాంగ్రెస్‌పార్టీ దేశ నాయకత్వం సోనియాగాంధి తమను గుర్తించి ఎస్సీ కమిషన్ మెంబరుగా ఇచ్చి రాష్ట్రపతితోనే ప్రశంసాపత్రాలు అందించారన్నారు. మాదిగ మహిళ అని అణగదొక్కేందుకే టికెట్ ఇవ్వలేదన్నారు. పార్టీ మారి కొత్తగా వచ్చిన వారికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వడమేమిటి, తాను చేసిన తప్పేంటని ఆవేదన వ్యక్తం చేశారు. . వైఎస్ షర్మిలను కడప ఎంపీగా గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర నాయకత్వం తమ అభ్యర్థిత్వాన్ని మరోసారి పునరాలోచించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్, కమల్ ప్రభాస్ పాల్గొన్నారు.

## సుధాకర్ యాదవ్‌తోనే ఖాజీపేట అభివృద్ధి



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న నాయకులు

ఖాజీపేట, ఏప్రిల్ 4: ప్రతి ఒక్కరు తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌ను గెలిపించుకోవాలని ఖాజీపేట టీడీపీ నాయకులు కమలాపురం గౌస్, సుంకు సత్యం పిలుపునిచ్చారు. గురువారం సుంకేసుల బైపాస్ రోడ్డులో ఇంటింటి ప్రచారం చేసి సూపర్-6 పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన నాయకుడు పుట్టా సుధాకర్‌యాదవ్ వస్తే ఖాజీపేట అభివృద్ధి చెందుతుందని, ఒక్కసారి అవకాశమిచ్చి చూస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తాడన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇర్ఫాన్, మహబూబ్‌బాషా, గౌస్‌లాజం, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ప్రయోగ పరికరాలు విరాళం



ప్రయోగ పరికరాలను ప్రారంభిస్తున్న ఎంఈవో పద్మలత

మైదుకూరు, ఏప్రిల్ 4 :మండలంలోని సుంకులుగారి పల్లె ప్రాథమికోన్నత పాఠశాలకు బాపట్ల జిల్లా పర్చూరు మండలం వీరన్న పాళెం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గోరట్ల వాసు బాబు ఆర్థిక సాయంతో బోధన సామాగ్రితో పాటు సైన్స్ ప్రయోగశాలకు అవసరమైన పరికరాలను అందజేశారు. వీటిని మండల విద్యాధికారి పద్మలత గురు వారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సహ విద్యాధికారి నరహరిశర్మ, ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి దేవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పూడిపోయిన మురుగు కాలువ.. రోడ్డు పైకి నీరు



పూడిపోయిన మురుగుకాలువ

కొండాపురం, ఏప్రిల్ 4 : మండలంలోని సుగుమంచిపల్లె ఆర్ అండ్ ఆర్ సెంటర్ వద్ద మురుగు కాలువ పూడిపోవడంతో మురుగునీరు రోడ్డు పైకి చేరుతోందని స్థానికులు వాపోతు న్నారు. పక్కనే హైస్కూల్ కూడా ఉండటంతో పిల్లలు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంటోందని వారు తెలిపారు. .ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తులు అంటున్నారు.